కమ్యూనిస్టు ఉద్యమం :

# "ఆల్ ఇండియా వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ" రాజకీయ తీర్మానం

**(1928 సం॥లో ఏర్పడిన ఆల్ ఇండియా వర్కర్స్ అండ్ పీజెంట్స్ పార్టీ (ఏఐడబ్ల్యుపిపి) రాజకీయ తీర్మానం. అధ్యయనం కోసం జనశక్తి పునర్ముద్రిస్తోంది)**

**గత** సంవత్సరం రాజకీయ పరిస్థితి, అంతకు ముందు సంవత్సరంలో వేసిన అంచనాలకు అనుగుణ్యంగా ఉంటూనే కొన్ని ముఖ్యమైన మార్పులకు గురైంది. వాటి ప్రధానమైన లక్షణాలు ఈ కింది విధంగా వున్నాయి :

1) బూర్జువా జాతీయ ఉద్యమాల పట్ల సామ్రాజ్యవాదం కఠిన వైఖరి కొనసాగిస్తూనే, ప్రజానీకం పట్ల నానాటికి తీవ్ర ప్రతీఘాతక ధోరణితో వ్యవహరిస్తోంది.

2) దానితో కాంగ్రెస్‌తో సహా దాదాపు అన్ని బూర్జువా పార్టీలు పిరికితనంతో గూడిన ఉదారవాద రాజ్యాంగ బద్ధ కోరికలు, మతపరమైన రాజీలకు మద్దతునిచ్చే కార్యక్రమానికి తిరిగి మళ్ళాయి.

3) కార్మికులు, రైతులు, పెటిబూర్జువాలు, ప్రజా ఉద్యమాలలో బలం, మిలిటెన్సీ గణనీయంగా పెరిగింది.

4) పెటిబూర్జువాలలోను, మరియు ప్రజానీకంలోను కోల్పోతున్న తమ ఆదరణను తిరిగి పొందడానికి ప్రయత్నిస్తూనే, సామ్రాజ్యవాదాన్ని ప్రజా ఉద్యమాలను చూపించి భయపెట్టేందుకు బూర్జువా వర్గంలోని ఒక సెక్షన్ ప్రయత్నిస్తోంది.

1) బ్రిటిష్ సామ్రాజ్యవాదం స్పష్టంగా అనుసరిస్తోన్న రెచ్చగొట్టే, మూర్ఖ విధానాలను చూస్తే, ప్రపంచంలో తన స్థానాన్ని నిలబెట్టుకోవడం దానికి క్లిష్టతరంగా మారుతోందన్న విషయాన్ని గమనించవచ్చు. యుద్ధం సమీపిస్తుండడం, ఆర్థిక పరిస్థితులు దిగజారుతుండడంతో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి, భారతదేశంలో తన ఆర్థిక, రాజకీయ ఆధిపత్యంలో ఎటువంటి మార్పు లేకుండా చూసుకోవడం అనివార్యమైపోయింది. తన ఆర్థిక ఆధిపత్యాన్ని కొనసాగించడానికి ఒక ముఖ్యమైన ఆయుధంగా వినియోగపడుతోన్న బ్రిటిష్ అదనపు పెట్టుబడి ఎగుమతికి కొరత ఏర్పడడంతో అది నానాటికి కష్ట తరమవుతోంది. రాజకీయ ఆయుధాన్ని ప్రయోగించడమే దానికి మిగిలింది. అందుకే బూర్జువా వర్గం మొత్తం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ రిజర్వు బ్యాంకు బిల్లును రుద్దడానికి, రూపాయి శాతాన్ని, రాజ్యాంగ సంస్కరణల కోసం పూర్తిగా బ్రిటిష్ దేశస్థులే వున్న కమిషన్ వేయడం మొదలైన వాటి అమలుకు బ్రిటిష్ రాజకీయ నియంతృత్వం పూనుకుంటోంది.

అదే సమయంలో బట్లర్ కమిటీ నియామకం, విధేయులైన ప్రముఖ సంస్థానాధీశుల ప్రకటనలను చూస్తుంటే, సామ్రాజ్యవాదం తన స్థానాన్ని కాపాడుకోవడానికి, రాష్ట్రాల మీద తన పట్టును బలోపేతం చేసుకోవడం, సైనిక సామర్థ్యాన్ని పెంచుకోవడం లాంటి తీవ్రమైన చర్యలే తీసుకుంటున్నట్లుగా కనబడుతోంది.

బ్రిటిష్ సామ్రాజ్యవాదం ఎదుర్కొంటున్న సమస్యల వల్లనే అది భారతదేశంలో తన మౌలికమైన ఆర్థిక, రాజకీయ విధానాలను కొనసాగించాల్సి వస్తోంది. తన ఆధిపత్యం ఉండేలా, భారతదేశ పెట్టుబడి సహకారంతో భారతదేశాన్ని పారిశ్రామీకరించడం అనేది బ్రిటన్ సామ్రాజ్యవాద విధానంగా వుంది. ప్రధానంగా భారతీయ సంస్థలు, పరిశ్రమలకు ఇస్తోన్న సుంకాలలో మినహాయింపులను చూస్తే రాయితీలనిచ్చే విధానాన్ని కొనసాగిస్తోనే ఉందని కనపడుతోంది. బ్రిటిష్ నియంత్రణ సంపూర్ణంగా, సమర్ధవంతంగా భద్రంగా ఉన్నంతవరకు, రాజకీయ రంగంలో భారత బూర్జువా వర్గంతో రాజీపడాలనే మౌలిక విధానాన్ని కొనసాగిస్తూనే వుంది. దానికోసం కొన్ని రాయితీలు కూడా ఇస్తోంది. యూరోపియన్ అసోసియేషన్‌కు చెందిన సైమన్ కమిషన్‌కు ఇచ్చిన మెమోరాండంలోని అంశాలను గమనిస్తే ప్రావిన్సియల్ ప్రభుత్వ అధికారాలతో పాటు, అసెంబ్లీలో కొన్ని నామినేటెడ్, ప్రభుత్వ సీట్లు పెంచడం వంటివి వున్నాయి. అదేసమయంలో కేంద్రంలో బ్రిటిష్ అధికారాలు పెరగడం కనపడుతుంది. బూర్జువా వర్గానికి కొన్ని రాయితీలివ్వడం వుంది, కానీ ప్రజానీకానికి ఏమీ లేవు. వయోజన ఓటు హక్కు పొందే ప్రాతిపదికను విస్తృతం చేయడం లేదు. నెహ్రూ రిపోర్టు పట్ల అధికారులు, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మరియు ఆంగ్లో–ఇండియన్ పత్రికారంగం భాద్యులు చూపిస్తోన్న గౌరవమైన వైఖరి చూస్తుంటే, రాజీపడాలనే తాపత్రయానికి నిదర్శనంగా వుంది. అందువలన హఠాత్తుగా సామ్రాజ్యవాదం ప్రదర్శిస్తోన్న దూకుడును చూసి, భారత బూర్జువా వర్గం పట్ల దాని విధానంలో మౌలికమైన మార్పు వచ్చిందని భావించరాదు. అది పాక్షికంగా లేదా బహుశా తాత్కాలికంగా వచ్చిన మార్పుగానే చూడాలి. ప్రాథమికంగా దాని విధానం యథాతథంగానే వుంది.

2) ప్రభుత్వ దృఢవైఖరిని చూసి బూర్జువా వర్గం మళ్లీ వెనక్కు తగ్గింది. సైమన్ కమిషన్ ఏర్పాటుతో సహజంగా కలిగే ఆగ్రహావేశాలు, ప్రజల ఒత్తిడి వారిని రాజీలేని వైఖరి తీసుకునే దిశగా మళ్లించింది. కాంగ్రెస్ నాయకత్వం విషయానికే వస్తే, సైమన్ కమిషన్ వచ్చినప్పుడు హర్తాళ్ పాటించడానికి, స్వాతంత్రానికి మద్దతుగా తీర్మానం చేయడానికి ఆమోదించింది.

కానీ ఆ తర్వాత అన్ని పార్టీల సమావేశం ఏర్పాటు చేసినప్పుడు, ప్రజల పక్షం నిలబడాలా లేక తమ వర్గ ప్రయోజనాలవైపా అనే ప్రశ్న బూర్జువా పక్షం ముందుకు వచ్చినప్పుడు అది రెండవ దానినే ఎంచుకుంది. ఆవేశపూరిత బెదిరింపులతో ఏమీ సాధించలేరనే ప్రభుత్వ ధోరణి అందరిని ఆకట్టుకుంది. ఆచరణ సాధ్యమైన రాజ్యాంగ అవకాశాల ప్రాతిపదికన బూర్జువా ఐక్యసంఘటన తప్ప మరో మార్గం లేకుండా పోయింది. అదే కారణంగా అన్ని బూర్జువా పార్టీలు తమ రాజకీయ, మత పర విబేధాలను పక్కన పెట్టి, సామ్రాజ్యవాదంతో రాజీపడడానికి నెహ్రూ నివేదికలో చేసిన 'సమంజసమైన' ప్రతిపాదనలకు మద్దతునిచ్చాయి.

అన్ని పార్టీల సమావేశం ఆమోదం తెలిపిన నెహ్రూ రిపోర్టు ఈ కింది ముఖ్యమైన డిమాండ్లను పెట్టింది :

1) ఆర్థికం, కస్టమ్స్, పన్నులు మొదలైన వాటితో పాటు ఆంతరంగిక వ్యవహారాలలో సార్వత్రిక ఓటు హక్కు ద్వారా ఎన్నుకోబడిన పార్లమెంటుకు పూర్తి బాధ్యతనివ్వాలి. 2) వ్యక్తిగత ఆస్థికి ప్రత్యేక రక్షణ కల్పించడం, ట్రేడ్ యూనియన్‌లు పెట్టుకొనే కొన్ని హక్కుల లాంటి వాటితో పాటు, బూర్జువా ప్రజాస్వామిక హక్కుల తరహాలో వ్యక్తిగత హక్కులు కల్పించాలి.

దానికి ప్రతిగా వీటికి ఆమోదం తెలిపారు : (1) విదేశీ వ్యవహారాలను అధినివేశ ప్రతిపత్తి గల దేశాల లాగానే (డొమినియన్స్) నిర్వహించుకోవాలి. (2) కార్యనిర్వహణాధికారాలు పేరుకు రాజు చేతిలోనే ఉంటాయి. కానీ అవి నామినేట్ చేయబడిన గవర్నర్ జనరల్ మరియు గవర్నర్‌ల ద్వారా అమలు చేయబడతాయి. 3) బ్రిటిష్ యొక్క ఆర్థిక, వాణిజ్య ప్రయోజనాలకు వ్యతిరేకంగా వివక్ష ప్రదర్శించకుండా ఉండడం. 4) బ్రిటిష్ అధికారులు, కొంతమంది మంత్రులతో కూడిన కమిటీ నియంత్రణలో సాయుధ బలగాలు ఉంటాయి. 5) ప్రస్తుతం వున్న సివిల్ మరియు ఇతర అధికారుల జీతభత్యాలకు హామీ ఇవ్వడం. వాళ్ళ రాజీనామా అనేది స్వచ్ఛందంగనే ఉండడం. 6) భారతదేశంలోని సంస్థానాలు ప్రస్తుతం వున్న ఏలుబడిలోనే వుంటూ భారత ప్రభుత్వంతో సంబంధాలు కలిగి ఉంటాయి.

ప్రజానీకం కోసం ఎటువంటి కార్యక్రమం లేకుండా పోయింది. సంస్థానాలలోనివాళ్ళు ఆయా రాజుల దయా దాక్షిణ్యాలకు వదిలి వేయబడ్డారు. బ్రిటిష్ ఇండియాలో వుండేవాళ్లకు, ఓటు హక్కు, కొన్ని వ్యక్తిగత హక్కులు, ట్రేడ్ యూనియన్ హక్కులు, ప్రాథమిక విద్య, ఆర్థికాభివృద్ధి, కౌలుదారులకు రక్షణ గురించి అరకొర వాగ్దానాలు ఇవ్వబడ్డాయి. భూస్వామ్య వ్యవస్థ యథాతథంగా ఉంచబడింది.

ఈ రిపోర్టు పురోగామి స్వభావం లేని కొద్దిపాటి బూర్జువా ప్రజాస్వామిక పథకంలాగుంది. సామ్రాజ్యవాదం ముందు కనీస కోర్కెలు మాత్రమే పెడుతోంది. కాంగ్రెస్ పార్టీ ఈ రిపోర్టును ఆమోదించడమంటే, గత సంవత్సరం ఆ పార్టీ తీసుకున్న వైఖరి నుండి నిర్ణయాత్మకంగా తిరోగమించడమే! బూర్జువా వర్గం యావత్తు తమలోని చిన్నపాటి బేధాభిప్రాయాలు సర్దుకుని, కనీస కోర్కెల కార్యక్రమంతో సామ్రాజ్యవాదంతో పూర్తిగా మిలాఖత్ అయి, ప్రజానీకం నుండి సంపూర్ణంగా వేరుబడిపోయి ఒక ప్రతీఘాత శక్తిగా అవతరించడమే!

ప్రజానీకానికి నాయకత్వం వహించాల్సిన బూర్జువా వర్గం ఎలా తిరోగమించిందో, ఈ విధంగా కూడా తెలుసుకోవచ్చు :

(1) భూమి శిస్తు పెంపుదలకు నిరసనగా సాగిన బార్డోలీ రైతాంగ పోరాటానికి ద్రోహం చేయడం. (2) ఈ సంవత్సరంలో సాగిన అనేక కార్మికుల సమ్మెలను పట్టించుకోకపోవడం, కొన్ని సందర్భాలలో వ్యతిరేకించడం. (3) తీవ్ర ప్రమాదకరమైన, ప్రతీఘాతకమైన కార్మిక విధానాల బిల్లును వ్యతిరేకించడంలో నామమాత్రంగాను, అర్థమనస్కంగాను వ్యవహరించడం. (4) బెంగాల్ కౌలుదార్ల చట్ట సవరణ బిల్లు విషయంలో బెంగాల్ కాంగ్రెస్ కౌన్సిల్ పార్టీ తీరు చూస్తే, అది ప్రతి సందర్భంలోను జమీందార్లకు అనుకూలంగాను, సాగుదార్లకు వ్యతిరేకంగాను ఉండి, తరచుగా ప్రభుత్వానికి మద్దతుగా ఓటు చేసింది.

(3) మొత్తం మీద చూసినప్పుడు బూర్జువా వర్గం వెనక్కి తగ్గుతుండగా, పెట్టీ బూర్జువా వర్గంలో ఒక పెద్ద సెక్షన్‌తో సహా ప్రజానీకం గుర్తించదగిన విధంగా పురోగమిస్తున్నారు. కొద్ది కాలంగా గత ఆరేడు సంవత్సరాల కాలంలో లేనివిధంగా, కార్మికోద్యమం నెమ్మదిగా పెరుగుతూ కార్యకలాపాలలోను, మిలిటెన్సీలోను ఉన్నత స్థాయికి చేరింది.

కార్మిక వివాదాలలో అధికభాగం ఈ లక్షణాలతో వున్నాయి (1) తీవ్రమైన మొండివైఖరి, సాగదీతలు; కార్మిక శక్తిని దెబ్బతీయడానికి పెట్టుబడిదారులు బెదిరింపులు, మోసాలకు పాల్పడుతున్న చాలా సందర్భాలలో కార్మికులు విశేషమైన ధైర్యం, ఓర్పు ప్రదర్శిస్తున్నారు. (2) పెట్టుబడిదారుల తరఫున రాజ్యాంగ యంత్రం క్రియాశీలంగా జోక్యం చేసుకోవడం : పెద్ద ఎత్తున అరెస్టులు, సమావేశాలను నిషేధించడం, కార్మికుల ఇళ్లలో బలవంతంగా ప్రవేశించడం, చావబాదడం మొదలైన పనులు చేయడం. (3) దీని పర్యవసానంగా కొన్ని సందర్భాలలో కార్మికులు పాత తరహా బూర్జువా నాయకుల భావజాలాన్ని వదిలించుకుని, వర్గ చైతన్యాన్ని అలవర్చుకుని యాజమాన్యంతోను, రాజ్యాంగ యంత్రంతోను పోరాడాలనే ధోరణి కనపడుతోంది. (4) కార్మికులలో పురోగామి తరగతుల రాజకీయ చైతన్యం గణనీయంగా పెరిగింది. అదేసమయంలో ఉద్యమ పునాది కూడా విస్తరిస్తోంది; గతంలో నిర్మాణం లేని ఎన్నో పరిశ్రమలలో కూడా పలు వివాదాలు తలెత్తాయి.

వాణిజ్యరంగంలో తలెత్తిన సంక్షోభం, యాజమాన్యాలు ఎదురుదాడికి దిగడం, పెరుగుతోన్న ధరలు, కార్మికోద్యమ

చైతన్యం, విప్లవ భావజాలాలు క్రమంగా పెరగడం వంటి ప్రాథమిక పరిస్థితులు, ఈ రకమైన ఉద్యమాభివృధికి తోడ్పడ్డాయి. కొన్ని ఎదురు దెబ్బలు, స్థానికంగా నిరుత్సాహాలు ఎదురౌతున్నప్పటికీ ఈ ఉద్యమం తీవ్ర అంతరాయం లేకుండా కొంత కాలం కొనసాగే అవకాశం ఉంది.

రైతాంగ ఉద్యమం కూడా గుర్తింపు నోచుకోనప్పటికీ ముఖ్యమైన ప్రగతి కనబడుతోంది. భూస్వాములు లేదా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వాస్తవంగా ఉద్యమించడం లేదా హెచ్చరించడం బొంబాయి, మద్రాస్, యు.పి., బెంగాల్‌లలో జరిగాయి; వాటిలో ఎక్కువగా ఆత్మరక్షణ ధోరణిలో ఉన్నప్పటికీ, ఒకటి రెండు ఎదురుదాడికి దిగినవి కూడా వున్నాయి. వివిధ ప్రావిన్సియల్ రాష్ట్రాలలో (బ్రిటిష్ పాలిత) పలు కార్మిక కర్షక సమావేశాలు నిర్వహించబడ్డాయి.

పెటీబుర్జువాలలో కొన్ని తరగతుల కార్యకలాపాల జోరు కూడా పెరిగింది. యువజనోద్యమం కార్యకలాపాలు, ప్రతి సంస్థలలోను, కాంగ్రెస్ మొదలైన వాటిల్లోనూ స్వాతంత్రం నినాదానికి ఉత్సాహంగా ఆమోదాన్ని తెలపడంలలో ఇది వ్యక్తమవుతోంది. కానీ ఆచరణలో ఒక ప్రజాసంఘంగా ఆచరణలో రూపొందే స్థాయికి ఇంకా చేరలేదు.

ప్రజా ఉద్యమాల పెరుగుదలకు అందులోను ముఖ్యంగా నాయకత్వ పాత్ర గల కార్మికోద్యమానికి ప్రతిస్పందనగా ప్రభుత్వం అనుసరిస్తోన్న అణిచివేత విధానాలకు తోడుగా మరింత తీవ్రమైన చర్యలు తీసుకుంటోంది. అందుకోసమే ట్రేడ్ డిస్ప్యూట్ బిల్‌ను తీసుకొచ్చింది. రాజకీయ రంగు గల అన్ని సమ్మెలను తీవ్రంగా శిక్షించడం, రైల్వేస్ మరియు ఇతర సేవలలోని చురుకైన నిర్మాణం గల కార్మికవర్గాన్ని సమ్మెలు చేయకుండా నిరోధించి, ఇతర కార్మికోద్యమం నుండి వేరుచేసి బలహీనపరచడం వంటి ముఖ్యమైన ప్రతిపాదనలు ఈ బిల్లులో వున్నాయి. అంతర్జాతీయ విప్లవ కార్మికోద్యమానికి, భారతీయ కార్మికులకు మధ్యగల నామమాత్రపు సంబంధాలను కూడా తెంచి వేయడానికి పబ్లిక్ సేఫ్టీ బిల్ ద్వారా చర్యలు తీసుకొన్నారు. ట్రేడ్ యూనియన్స్‌లో వుండే ప్రతీఘాత నాయకత్వానికి మద్దతునిచ్చి బలోపేతం చేసేందుకు, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఐఎఫ్‌టియు), బ్రిటిష్ ట్రేడ్స్ యూనియన్ కాంగ్రెస్ వంటి సంస్థల ద్వారా ప్రయత్నాలను పెంచారు.

ప్రచురించబడిన నెహ్రూ రిపోర్టులోని సూటిదనం, స్వీయ నియంత్రణలు, బూర్జువా జాతీయవాదం యొక్క నిజస్వరూపాన్ని, లక్ష్యాలను బయటపెట్టడంతో, కాంగ్రెస్ శ్రేణులలో సంక్షోభం తలెత్తినది. కొద్ది కాలంగా సాగుతోన్న బూర్జువా జాతీయవాద ప్రచారం ముఖ్యంగా సంపూర్ణ స్వాతంత్ర్యానికి అది చూపిస్తోన్న మద్దతులోని కపటత్వాన్ని పూర్తిగా బహిర్గతపరిచింది. స్వాతంత్ర్యం నినాదంతో పెటిబూర్జువా వర్గంలో రేకెత్తించిన ఉత్సాహం కాస్తా నీరుగారిపోయి అది ఏహ్యాభావంతో తన మద్దతును ఉపసంహరించుకుంటుందేమోనని భయం మొదలైంది. అదే సమయంలో వేగవంతంగా కమ్ముకొస్తున్న కార్మిక వుద్యమాల శక్తి, వాటి నుండి బూర్జువా వర్గానికున్న ప్రమాదం చూసి ఎంతోమందిలో సదభిప్రాయం కలుగుతోంది. పాత తరహా మెతక బూర్జువా కార్మిక నేతల నియంత్రణ నుండి అది తనను తాను విముక్తి చేసుకోవడం కనబడుతోంది.

దాని ప్రకారమే "ఇండిపెండెన్స్ ఫర్ ఇండియా లీగ్" ప్రారంభించబడింది. అది తన కార్యక్రమాన్ని పూర్తిగా వివరించక ముందే బూర్జువా రాజకీయ వేత్తలలో వేగంగా మద్దతు పొందుతోంది. దాని కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసునేటట్లయితే అది ప్రజా విప్లవానికన్నా ఏమి తక్కువ కాదు. విప్లవం, సోషలిజం లాంటి కొన్ని మాటలు కూడా వినబడుతున్నాయి. ప్రదర్శన కోసమైనా సరే అటువంటి తీవ్ర పరిభాషను ప్రజలు, పెట్టిబుర్జువా వర్గం ముందు కొనసాగనిచ్చినట్లైతే వాళ్ళు ప్రభావితులై బూర్జువా వర్గం శ్రేణుల్లో తీవ్రమైన చీలిక వచ్చే అవకాశం వుంది. దీన్ని ఆపడం కోసమే బెంగాల్ గ్రూపు, జనరల్ బాడీ కన్నా ముందే అఖిల భారత లీగ్‌ను కట్టడి చేయడానికే అన్నట్లు స్పష్టంగా బూర్జువా అవగాహనకు లోబడి స్వాతంత్ర్యం ప్రచారం ఉండేలా ఒక కార్యక్రమాన్ని, స్వతంత్రంగా ప్రతిపాదించింది.

"ఆర్థిక విముక్తి", ఆర్థిక అసమానతల నిర్మూలన", ప్రజానీకాన్ని మేలుకొలపడం" వంటి పదజాలాలు బెంగాల్ గ్రూప్ ప్రచురించిన కార్యక్రమం మరియు ఆశయాలలో కనబడినప్పటికీ, బూర్జువా వర్గంలోని ఉదారవాద శ్రేణులకు పూర్తిగా ఆమోదం కానివేవి కావు. రాజకీయ స్వాతంత్రం విభాగంలో పూర్తి స్వాతంత్రాన్ని తప్ప మరోటి అంగీకరించేది లేదనడం, సోషల్ డెమోక్రసీ మీద సంఘ సంస్కరణల ప్రచారం లాంటివి వున్నాయి. పారిశ్రామిక కార్మికుల కోసం ఎనిమిది గంటల పనిదినం, నిరుద్యోగ భృతి, అనారోగ్య ఇన్సూరెన్సు మొదలైనవి కూడా ఆర్థిక డిమాండ్లలో ఉన్నాయి. రుణాల మీద వడ్డీలపై నియంత్రణ, కోపరేటివ్ సంస్థల ద్వారా చౌక రుణాల సరఫరా వుంది. పరిశ్రమలకు సంబంధించి, రైల్వేలు, షిప్పింగ్, విమాన సేవల వంటి ముఖ్య పరిశ్రమలను జాతీయం చేయడం, తప్పనిసరి ఆర్బిట్రేషన్, లాభాలలో వాటా, యాజమాన్యంలో కార్మికులకు భాగస్వామ్యం వంటివి ఉన్నాయి. వారసత్వ ఆస్తి మీద పన్నుతో సహా ప్రైవేట్ పెట్టుబడి మీద పన్నుల ప్రతిపాదనలు ఉన్నాయి.

తమ ఆర్థిక కోర్కెల సాధన కోసం ప్రజలలోని విప్లవ శక్తిని మేలుకొల్పే ఉద్దేశం గల, కార్యక్రమం కాదిది. ఆధునిక బూర్జువా పనివిధానంలోకి భారత పారిశ్రామికీకరణను మళ్లించడం, దానిలో భాగంగానే కార్మిక నియంత్రణ సాధించడం అనే ప్రణాళికతో వుంది. అది ప్రధానంగా బూర్జువాల కొరకు రూపొందించిన కార్యక్రమం. దానిలో కార్మికుల సంబంధితమైనవి

కూడా చేర్చబడ్డాయి. అవి కార్మికుల డిమాండ్‌లుగా కాక, బూర్జువా స్వాతంత్రం సాధించాక కార్మికులకు తాము నెరవేర్చే హామీలుగా చేర్చారు. ఆ విధంగా స్వతంత్ర కార్మికోద్యమాన్ని అదుపులో పెట్టే వ్యూహం వుంది. ప్రత్యేకంగా చూస్తే అది ఎటువంటి విప్లవ ప్రాముఖ్యత లేనిదిగా స్పష్టమౌతుంది.

భూమి సంబంధించిన దాని కార్యక్రమం మరింత ప్రతీఘాతకంగా వుంది. వ్యవసాయ రుణాల రద్దు, నష్టపరిహారమిచ్చి భూస్వామ్య వ్యవస్థను తొలగించడం వంటివి వున్నాయి. ఈ విషయంలో ఇండిపెండెన్స్ లీగ్ భూ యాజమాన్య హక్కుల గురించి, కాంగ్రెస్ కన్నా భిన్నంగా వ్యవరించదలుచుకుంది. ఎందుకంటే బెంగాల్‌లో భూస్వాముల ప్రయోజనాలు కాపాడడంలో కాంగ్రెస్ ప్రతీతి గాంచింది. ఇతరత్రా ప్రధాన అంశాలన్నిటిలోను అది కాంగ్రెస్‌తో ఏకాభిప్రాయంతోనే వుంది.

ఈ కార్యక్రమంలోని అవాస్తవాన్ని, కపటత్వాన్ని గ్రహించడానికి, అది తన ఆశయాలను ఏ పద్ధతి ద్వారా సాధించదలుచు కున్నామనే విషయం గురించి ఒక్కమాట గూడా రాయలేదనే విషయాన్ని గమనిస్తే, ఇట్టే బయట పడిపోతుంది. ఆ సంస్థ నాయకులు చేసే ప్రచారాలను మరియు కార్మిక వివాదాలలో వాళ్ళ ప్రవర్తనను గమనించినట్లయితే వాళ్ళ కార్యక్రమం యొక్క విప్లవ ప్రతీఘాత స్వభావం తెలిసిపోతుంది. (1928 సం॥లో మహారాష్ట్ర ప్రొవిన్సియల్ కాన్ఫరెన్స్‌లో శ్రీ ఎస్.సి.బోస్ చేసిన అధ్యక్షోపన్యాసంలో వర్గ పోరాటాన్ని గట్టిగా వ్యతిరేకించారు.) ఒకటికన్నా ఎక్కువ సమ్మెలలో ఇండిపెండెన్స్ లీగ్ లీడర్‌లు జాతీయ పరిశ్రమల ప్రయోజనాల కోసం ఆ సమ్మెలను ఆపడానికి ప్రయత్నించారు. వీళ్లకు సంబంధించిన కొందరు నాయకులు ఫాసిస్టులకు మద్దతు తెలపడానికి కూడా వెనకాడలేదు.

ఇతరులతో పోలిస్తే బెంగాల్ విభాగం ఉదారవాదంగా కనబడినప్పటికీ, మొత్తం మీద చూస్తే లీగ్ యొక్క స్వభావం మౌలికంగా అలాగే వుంది. వీటిని చూస్తే ఈ విషయం స్పష్టమౌతుంది. (1) తొలి మేనిఫెస్టో మీద సంతకం పెట్టిన ముఖ్య నాయకులు, అఖిలపక్షం సమావేశం సభ్యులు ఈ లీగ్ జాతీయ కాంగ్రెస్‌లో విభాగంగా మాత్రమే వుండాలని నిర్ణయించారు. జాతీయ కాంగ్రెస్ విధానాల పట్ల విశ్వాసం గల ఏ సెక్షన్ లేదా గ్రూప్ కానీ ప్రజానీకానికి నాయకత్వం వహించలేదు. కాంగ్రెస్ లక్ష్యాలు వర్గపోరాటానికి వ్యతిరేకంగాను, జాతీయవాదానికి అనుకూలంగాను వున్నాయి. వర్గ పోరాటం చేయడం ద్వారానే ప్రజా ఉద్యమం అభివృద్ధి చెందుతుంది. కాంగ్రెస్ సభ్యులకు మాత్రమే లీగ్ సభ్యత్వాన్ని పరిమితం చేయడమంటే ప్రజలను మినహాయించడమే! (2) "డొమినియన్ స్టేటస్" తప్ప అంటూ నెహ్రూ రిపోర్టుకు, అటు ఇండిపెండెంట్ లీగ్‌కు ఎంతోమంది సమాంతరంగా మద్దతునిచ్చారు. అయితే ఆ రిపోర్టు మొత్తం కూడా డొమినియన్ స్టేటస్ మీదనే, అనగా సామ్రాజ్యవాదంతో రాజీపడడమే ప్రాతిపదికగా వుంది. దానిలోని నిబంధనలు చూస్తే వాటి ప్రకారం ఎటువంటి స్వాతంత్రాన్ని మనం సాధించలేమని తెలుస్తుంది.

(3) స్వాతంత్రం కోసం మనం డిమాండు చేస్తే, రాజీ మార్గంగా డొమినియన్ స్టేటస్ వస్తుందనే సూచన పునరావృత మౌతోంది. (4) ఈ విషయాన్ని సీరియస్‌గా పట్టించుకోకపోవడంలో లీగ్‌కు చెందిన దాదాపు ప్రచార కార్యకర్తలందరి వైఫల్యం కనబడుతోంది. స్వాతంత్రానికి అనుకూలంగా ఇష్టాన్ని వ్యక్తపరుస్తే చాలు, అది లీగ్‌లో సభ్యత్వానికి అర్హతగా సరిపోతుంది. స్వాతంత్రం పట్ల సెంటిమెంటును ప్రచారం చేయడమే లీగ్ కార్యక్రమం! స్వాతంత్ర సాధనలో వుండే విప్లవ పరిణామాలను దాదాపుగా పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు.

విభిన్న ధోరణుల ఫలితమే ఇండిపెండెన్స్ ఫర్ ఇండియా లీగ్ అని మనం చూడవచ్చు. (1) పెటిబూర్జువాలోని ఒక సెక్షన్, విప్లవ విధానాల దిశగా సంకోచం, గందరగోళంతో వేసిన ఒక అడుగుగా కనబడుతోంది. విప్లవ ప్రజా ఉద్యమాలను అడ్డుగా పెట్టుకొని మధ్యతరగతికి స్వాతంత్రం సంపాదించాలనే ఒక ఆలోచన కూడా దానిలో ఉండి ఉండవచ్చు. (2) మధ్యతరగతి మరియు ఇతర ప్రజానీకంలో వున్న స్వాతంత్ర ఉద్యమస్ఫూర్తిని చూపించి సామ్రాజ్యవాదాన్ని బెదిరించి కొన్ని రాయితీలు గుంజుకోవాలని బూర్జువా వర్గంలో ఒక సెక్షన్ ప్రయత్నం లాగుంది. (3) మొత్తం మీదుగా బూర్జువా వర్గంలోను, బూర్జువా కార్మిక నాయకులలోను రోజు రోజుకు పెరుగుతోన్న ప్రతీఘాతక స్వభావం వలన, ప్రజా ఉద్యమాలు, పెట్టీబూర్జువా మీద కోల్పోతున్న పట్టును తిరిగి సాధించుకోవడానికి బూర్జువా వర్గంలో ఒక సెక్షన్ చేసే ప్రయత్నంగా వుంది.

ప్రజాఉద్యమాలు పెరుగుతోన్న పరిస్థితుల్లో వర్కర్స్ అండ్ పీజెంట్స్ పార్టీ ఏమి చేయాలంటే

(1) ఆ ఉద్యమాలు ఉధృతమయ్యేందుకు పూర్తిగా తోడ్పడాలి. (2) వాటి ఆలోచనల్లో వుండే గందరగోళాన్ని తొలగించి స్పష్టతనివ్వాలి. (3) వాటి నిర్మాణాన్ని, ముఖ్యంగా అగ్రగామి తరగతి ఐన కార్మికవర్గాన్ని అభివృద్ధి చేయాలి. పార్టీని విస్తరించి బలోపేతం చేయాలి.

మొదటి అవసరాన్ని నెరవేర్చడానికోసం ప్రజా ఉద్యమాల ఊపును పెంచేందుకు తోడ్పడే అన్ని సంస్థలతో అది కార్మికులు లేదా కర్షకులు లేదా పెటీబూర్జువాలతో ఐక్య సంఘటన ఏర్పరచాలి. కానీ ఇతర అవసరాల కోసం మాత్రం దేశంలోని విప్లవ ప్రజాశక్తులను ఐక్యం చేసి నాయకత్వం వహించగలిగినది, అందుకు సరైన విధానంగల ఏకైక సంస్థ అయినటువంటి వర్కర్స్ అండ్ పీజంట్స్ పార్టీ, స్వతంత్ర కార్యాచరణను అనుసరించాలని గతంలో కన్నా బలంగా నొక్కి చెప్పాల్సి వుంది. మన

పార్టీ ఇంకెంతకాలం వేరే సంస్థలో ఒక విభాగంగానో లేదా ఒక సెక్షన్‌గానో ఉండజాలదు. ఉధృతమౌతోన్న ప్రజా ఉద్యమాలకు అది మాత్రమే నిజమైన ప్రతినిధి.

గత సంవత్సర పరిణామాలు గమనిస్తే వర్కర్స్ అండ్ పీజంట్స్ పార్టీ ఒక వైపు, జాతీయ కాంగ్రెస్ దాని ఇండిపెండెంట్ వింగ్ మరో వైపు నిలబడడం కొత్త స్థాయికి చేరింది. బూర్జువా వర్గానికి, సామాన్య ప్రజానీకానికి మధ్య వున్న విభేధాలు క్రమంగా కొన్ని సంవత్సరాలుగా బయట పడుతున్నప్పటికీ, అవి నేడు నిర్ణయాత్మకంగా పదునెక్కినాయి. మొత్తం మీద చూస్తే బూర్జువా వర్గం వెనకడుగు వేసినప్పటికీ, ఆవిధంగా చేయని సెక్షన్ మటుకు ఎత్తుగడగానే ముందు భాగంలో కొనసాగుతోందని స్పష్టమౌతోంది. మరోవైపు చూస్తే సామాన్య ప్రజానీకం గణనీయంగా పురోగమించింది. గత కాలంలోని ఉద్యమాల మధ్య సంబంధాలని చూస్తే వర్కర్స్ అండ్ పీజెంట్స్ పార్టీ జాతీయోద్యమంలో విభాగంగాను, కాంగ్రెస్ పార్టీలో ఒక గ్రూపుగాను పనిచేయడం కనబడుతుంది.

ఆ పరిస్థితి ఇంకెంతోకాలం లేదు. వర్కర్స్ అండ్ పీజెంట్స్ పార్టీ పురోగమిస్తోన్న ప్రజా ఉద్యమానికి ప్రతినిధిగా వుంది. కాంగ్రెస్‌లో ఆధిపత్యంలో వున్న నాయకత్వం తిరోగమిస్తున్న బూర్జువా వర్గంతో కలిసి నడుస్తోంది. దాని ప్రాతినిధ్య సంస్థనే ఈ అఖిలపక్షం! ఈ రెండు ఉద్యమాలు వేరు వేరైనవి. వాటికి నాయకత్వం వహించే సంస్థలు కూడా వేరుగానే ఉండాలి. అందువలన ఇక ముందు కాలంలో వర్కర్స్ అండ్ పీజెంట్స్ పార్టీ తప్పనిసరిగా స్వతంత్రంగా వ్యవహరించాలి.

అయితే కొంతకాలం పాటు కాంగ్రెస్ పార్టీ బూర్జువా నాయకత్వంలో పలు విశ్వాసాలతో, సమ్మిళిత లక్షణాలతో ఒక వదులైన నిర్మాణంతోనే ఉంటుంది. కానీ దానికి వివిధ సామాజిక తరగతులు, విప్లవ స్వభావంగల విభిన్న రాజకీయ ధోరణులు గల పెటీబూర్జువా అనుచర వర్గం వుంది. దీని పరిస్థితి ఇలా ఉండగా దానితో పోలిస్తే వర్కర్స్ అండ్ పీజెంట్స్ పార్టీ, బలహీనంగాను, నిర్మాణ లేమితోను ఉంది. అందువలన మనం సంప్రదాయంగా అనుసరిస్తోన్న విధానాన్ని కొనసాగించాలి. కాంగ్రెస్ సంస్థలలో మనం ఫ్రాక్షన్స్ ఏర్పాటు చేసుకుని ఉద్యమ నిర్మాణం చేబడుతూ, ఆ పార్టీ నాయకత్వం యొక్క ప్రతీఘాత స్వభావాన్ని బహిర్గతం చేయాలి. ఆ విధంగా దానిలోని విప్లవ శ్రేణులను మన వర్కర్స్ అండ్ పీజెంట్స్ పార్టీ వైపు మళ్లించాలి. అయితే ఈ విధానం తాత్కాలికమే! కాంగ్రెస్ పార్టీలో ఆధిపత్యంలోకి రావాలనో లేక నాయకత్వాన్ని చేజిక్కించుకోవాలనే ఉద్దేశం వర్కర్స్ అండ్ పీజెంట్స్ పార్టీకి లేదు. దాని సభ్యులు కాంగ్రెస్‌లో విమర్శనాత్మకంగానే వుంటారు. పార్టీ సభ్యులు, కాంగ్రెస్ సంస్థలలో ఆఫీస్ బేరర్ పదవులు చేబట్టడానికి అనుమతి లేదు. ఎంత త్వరగా అయితే అంత త్వరగా తన స్వతంత్ర సంస్థను నిర్మించుకోవడం వర్కర్స్ అండ్ పీజెంట్స్ పార్టీ ఆశయంగా వుంది. దాని వలన కాంగ్రెస్‌లో చేరి ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉండబోదు.

ఇండిపెండెన్స్ లీగ్‌తో సంబంధం భిన్న స్వభావం కలిగి ఉంటుంది. దాని సభ్యత్వం ఏక స్వరూపంగా లేనప్పటికీ దానికొక నిర్దిష్టమైన విధానం, కార్యాచరణ వుంది. అది సారాంశంలో ఒక బూర్జువా సంస్థ. వర్కర్స్ అండ్ పీజెంట్స్ పార్టీ విధానానికి నిజాయితీ రహితంగా చేసిన వక్రీకరణనే దాని విధానం. పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు స్వతంత్రంగా ఎదగకుండా నిరోధించడమే దాని లక్ష్యం! వర్కర్స్ అండ్ పీజెంట్స్ పార్టీ సభ్యులు ఇండిపెండెన్స్ లీగ్‌లో సభ్యులుగా చేరలేరు. అలా చేరినట్లయితే, ప్రజలలో దానికి లేని ప్రాధాన్యతను, గుర్తింపును కల్పించి నట్లవుతుంది. స్వాతంత్రం కోసం ఇండిపెండెన్స్ లీగ్ చేస్తోన్న ప్రచార కార్యక్రమం ప్రాతిపదికన ఐక్యసంఘటనలో, వర్కర్స్ అండ్ పీజెంట్స్ పార్టీ దానితో కలిసి పనిచేయవచ్చును. అది ఎంత పనికిమాలిన సంస్థ అయినప్పటికీ అది చేసే ప్రచారానికి వాస్తవంలో కొంత విలువ ఉంటుంది. లీగ్ యొక్క కార్యక్రమం, విధానంలోని లోపాలను, ప్రాథమికమైన దాని బూర్జువా స్వభావాన్ని, ఫాసిస్ట్ లక్షణాలను, అంతిమంగా దాని విప్లవ ప్రతీఘాత పాత్రను కూడా మనం బహిర్గతపరిచి నిరంతరం ఎండగడుతూనే ఉండాల్సిన అవసరం వుంది.

ఇండిపెండెన్స్ లీగ్ విధానాలకు విరుద్ధంగా వర్కర్స్ అండ్ పీజెంట్స్ పార్టీ ఈ కింది ముఖ్యాంశాలను ఎత్తిచూపాలి.

(1) నెహ్రూ రిపోర్ట్ మొత్తాన్ని, ముఖ్యంగా ఏక కాలంలో ఈ రిపోర్టును, స్వాతంత్రం డిమాండును సమర్థించవచ్చనే వంచనను బట్టబయలు చేయాలి. దీనితోపాటు, డొమినియన్ హోదా పొందడమంటే "స్వతంత్రానికి చేరువగా ఒక అడుగు" వేసినట్లనే భావనను ఖండించాలి.

(2) స్వాతంత్ర్యానికి అర్థం చెప్పడంలో ఎటువంటి సందేహం ఉండరాదు; సామ్రాజ్యవాదం యొక్క రాజకీయ, సైనిక నియంత్రణను, దాని ఆర్థిక జోక్యాన్ని ధ్వంసం చేయాల్సి ఉంటుంది. అందువలన విప్లవం అనివార్యమౌతుంది.

(3) బూర్జువా నియంత్రణ నుండి కార్మికోద్యమం విముక్తి చెందాలని నొక్కి చెప్పాల్సి ఉంటుంది. అన్ని రకాల దోపిడీదారులకు వ్యతిరేకంగా వర్గపోరాటం చేయాల్సి ఉంటుంది.

(4) సూత్రప్రాయంగా నష్టపరిహారం లేకుండా భూస్వామ్య విధానాన్ని రద్దుచేయాలనే డిమాండును ముందుకు తీసుకువచ్చి, వ్యవసాయ విప్లవ ఆవశ్యకతను తెలియజేయాలి.

(5) బూర్జువాలు, మేధావులు సంస్థానాలలో ప్రజలతో సమావేశాలు నిర్వహించి, సంస్థానాలతో ఉండాల్సిన సంబంధాల

గురించి నెహ్రూ రిపోర్ట్‌లోని విధానానికి మద్దతు పలకడాన్ని తప్పనిసరిగా వ్యతిరేకించాలి. ఆ రిపోర్టు, ప్రభుత్వంతో సంస్థానాధీశులకున్న సంబంధాలలో పైపై మార్పులు కోరింది తప్ప, వాస్తవంలో ప్రస్తుతం వున్న ఫ్యూడల్ పాలనలోనే సంస్థానాలు ఉండేలా వదిలేసింది. బ్రిటిష్ ఇండియాలోని ప్రజానీకంతో పాటు, సంస్థానాలలోని ప్రజలను కూడా సమీకరించి, సంస్థానాలను రద్దుచేసి దేశమంతటా, ఒకేరకమైన ప్రజాతంత్ర ప్రభుత్వ ఏర్పాటుకోసం పోరాటం చేయడం మన పార్టీ విధానంగా ఉండాలి. సంస్థానాలలో ప్రజాఉద్యమాన్ని నిర్మించడం ద్వారా అవి సామ్రాజ్యవాదానికి పునాదిగా పనిచేయడాన్ని ధ్వంసం చేయడం లేదా తటస్థంగా మార్చడమో చేయగలుగుతాము.

ఇతర మార్గాల ద్వారా కూడా తన కార్యక్రమాలను రూపొందించుకోవాల్సిన అవసరం పార్టీకి వుంది. ప్రచార ఉద్యమం, నినాదాల కోసం గతంలోలాగా కాంగ్రెస్, బూర్జువా ఉద్యమాల మీద ఆధారపడడం మానాలి. అన్ని రాజకీయ వ్యవహారాలలో పూర్తిగా స్వతంత్రంగా తన స్వంత చొరవ తీసుకోవాలి. (1) బూర్జువా రాజకీయవేత్తలు చూపిస్తోన్న ఉదాసీన వైఖరిని పట్టించుకోకుండా ట్రేడ్ డిస్ప్యూట్ బిల్‌కు వ్యతిరేకంగా మరింత తీవ్రమైన ఉద్యమాన్ని నిర్మించాలి. (2) అదేవిధంగా యుద్ధ ప్రమాదానికి వ్యతిరేకంగా ముఖ్యంగా సోవియెట్ రష్యాపై దాడికి చేస్తోన్న సన్నాహాలను నిరసిస్తూ ప్రచారోద్యమం నిర్వహించాలి. (3) ఒక నిర్దిష్టమైన పద్ధతిలో విప్లవ జాతీయవాదం, కార్మికోద్యమాలకు గల అంతర్జాతీయ స్వభావాన్ని ప్రస్తుత రాజకీయాల నుండి ఉదాహరణలిస్తూ, ప్రజలకు, ముఖ్యంగా కార్మికులకు వివరించాలి. చైనా కార్మికులు, కర్షకులకు మద్దతునిస్తూ వారిమీద సామ్రాజ్యవాదంతో మిలాఖతైన బూర్జువా జాతీయవాదులు సాగిస్తోన్న తెల్ల భీభత్సానికి వ్యతిరేకంగా ప్రత్యేకంగా ప్రచారం చేయాలి. ఈ ఉద్యమంలో చైనా బూర్జువా వర్గం పోషిస్తోన్న పాత్రను బట్టబయలు చేయాలి. ఈ విషయంలో మొత్తం జాతీయ పత్రికారంగ ప్రచారం నిశ్చయంగా విప్లవ ప్రతీఘాతకంగానే వుంది. భారత్ మరియు చైనా బూర్జువావర్గాల మధ్య గల సానుభూతిని ఎండగట్టాలి.

*****